క్లుప్తంగా

డిప్యూటీ సీఎం దృష్టికి రోడ్ల సమస్య

భామిని: మండలంలోని అధ్వాన రహదారుల దుస్థితిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, మండల అధ్యక్షుడు రుంకు కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ద్వారా సమస్య విన్నవించామన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

సీతంపేట: స్థానిక గ్రంథాలయానికి రహదారి సౌకర్యం కల్పించాలని లైబ్రేరియన్ బబ్బురు గణేష్ కోరారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్‌రెడ్డిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానికంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడంతో గ్రంథాలయం ఎక్కడ ఉందో ఎవ్వరికీ తెలియడం లేదని పీఓ దృష్టికి తీసుకువచ్చారు.

పరామర్శ



అనితను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని బంగారిగూడ గ్రామానికి చెందిన సవర అనిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం గ్రామానికి చేరుకుని అనితను పరామర్శించారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాయితీలను రైతులు వినియోగించుకోవాలి

● డ్వామా పీడీ కె.రామచంద్రరావు

కొమరాడ: జీడిమామిడి మొక్కలు పెంచిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు వినియోగించుకోవాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని కంబవలస, విక్రంపురం తదితర గ్రామాల్లో నాటిన జీడిమామిడి మొక్కలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 3 వేల ఎకరాల్లో జీడిమామిడి నాటేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కొమరాడ మండలంలోని ఈ ఏడాది 151 ఎకరాల్లో జీడిమామిడి మొక్కలు నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ వారం రోజుల్లో మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. నాటిన ప్రతీ మొక్కను జాగ్రత్తగా కాపాడుకోవాలని రైతులకు సూచించారు. అందుకోసం మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందిస్తామన్నారు.

కేవీకేలో కొబ్బరి మొక్కల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన రైతులకు బుధవారం కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కాసరగడ్, గిరిజన ఉప ప్రణాళిక 2024–25లో భాగంగా రస్తాకుంటుబాయి కేవీకే ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు నాబార్డ్ ఏజీఎం ఎస్.దినేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 5540 కొబ్బరి మొక్కలను పార్వతీపురంలోని జట్టు ఆశ్రమం, రస్తాకుంటుబాయి కేవీకే ద్వారా గిరిజనులకు అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు కొబ్బరి తోటల పెంపకంతో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం జట్టు ఆశ్రమం నిర్వాహకులు పద్మజ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రాజు, అమృత వీణ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్ : బీజేపీలో సామాన్య కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. యువమోర్చా కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం పాలకొండలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టంకాల దుర్గారావు, వూణ్ణ పెదబాబు, జిల్లా కార్యదర్శి కె.తిరుపతిరావు, కారెపు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తోందని ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. జూలై 27న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 28 మంది విశ్వబ్రాహ్మణులు విజయవాడ అమ్మవారి దర్శనానికి బస్సులో వెళ్తుండగా ఏలూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయాలపాలైన విషయం విదితమే. అయితే ఆ ప్రమాదంలో గాయాలపాలైన గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావును రాష్ట్ర కమిటీ సభ్యులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ద్వారా మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. గాయపడిన వారికి పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆ సంఘం మన్యం జిల్లా మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.



పాలకొండ రూరల్: నగర పంచాయతీలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



భామిని: మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ప్రదర్శనలో పాల్గొన్న సీడీపీఓ శాంతిభవానీ, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి సీడీపీఓ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



పాలకొండ రూరల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సీమంతం చేపడుతున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు



గుమ్మలక్ష్మీపురం: కురుపాంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది



గరుగుబిల్లి: గరుగుబిల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బూజీనాయుడు, తదితరులు

తల్లిపాలతో ప్రయోజనాలెన్నో..

పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు పట్టించాలని ఐసీడీఎస్ అధికారులు సూచిస్తున్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. తల్లిపాలు అమృతంతో సమానమని.. అపోహలు వీడి బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని, అప్పుడు ఆరోగ్యకరమైన సమాజం నెలకొంటుందని పలువురు అభిప్రాయపడ్డారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్

అభివృద్ధి పనులు పరిశీలించిన ఐటీడీఏ పీఓ



కానసింగి రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ ఎస్.సేతుమాధవన్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పార్వతీపురం ఐటీడీఏ పీఓ ఎస్.సేతుమాధవన్ బుధవారం పరిశీలించారు. ముందుగా కురుపాం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లకు ఆదేశించారు. బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి వంటగది, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం మండలంలోని పెంగవ, గొరడలో చేపడుతున్న హట్ బజార్ నిర్మాణ పనులతో పాటు గుమ్మలక్ష్మీపురం ఈఆర్ రోడ్డు నుంచి కానసింగి వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. గొరడ గ్రామంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి వంటగది, సరుకుల నిల్వ గది, డార్మిటరీలను పరిశీలించారు. వైటీసీలోని గర్భిణుల వసతిగృహాన్ని సందర్శించి గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. మెట్లు ఎక్కేందుకు గర్భిణులు ఇబ్బంది పడతారు కాబట్టి వారికి కింద ఉన్న గదుల్లోనే వసతి కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని వైటీసీలో పనిచేస్తున్న చిరుద్యోగులు పీఓను కోరగా..పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడబ్ల్యూ ఈఈ శాంతీశ్వరరావు, డీఈ సింహాచలం , ఏఈ అప్పారావు ఉన్నారు.

సామూహిక స్నానాల ఖానా ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వైటీసీలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో ఐటీడీఏ నిధులు రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ సప్లై ఎన్విరాన్‌మెంట్ (సామూహిక స్నానాల ఖానా, మోటార్ బోరు, చేతిబోరు) పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. వైటీసీలోని వసతిగృహంలో ఉంటున్న గర్భిణులకు సహాయకులుగా వచ్చేవారితో పాటు వైటీసీలో శిక్షణ పొందే అభ్యర్థుల సౌకర్యార్థం వాటిని నిర్మించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అక్షయ ఫౌండేషన్ చైర్మన్ యోగిరెడ్డి తిరుపతి నాయుడు ఎమ్మెల్యే చేతులమీదుగా గర్భిణుల వసతి గృహానికి విద్యుత్ ఇన్వెర్టర్‌ను వితరణగా అందజేశారు. అనంతరం వైటీసీలోని పలువురు గర్భిణులకు ఎమ్మెల్యే సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో భద్రగిరి టీడబ్ల్యూ డీఈఈ సింహాచలం, ఏఈ ఎస్.అప్పారావు, వైటీసీ మేనేజర్ రాము, జనసేన నాయకులు కె.మల్లేశ్వరరావు, టీడీపీ నాయకులు, వైటీసీ ఇతర సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి సమకూర్చిన పాఠ్యపుస్తకాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగించుకొని చదువులో ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, వెంపటాబు భారతి, పోలూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చినమేరంగి పాఠశాల తనిఖీ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా డీఈవో పగడాలమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో సమావేశమై 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెరగడానికి తగు ప్రణాళిక రూపొందించుకోవాలని, ఆరవ తరగతి నుంచే పిల్లలకు తెలుగు,ఆంగ్లం, గణితంలో తగు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ప్రతి పాఠశాలలోనూ బడి తోట పెంచి తద్వారా వచ్చిన కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించాలని సూచించారు. జ్వరంతో బాధపడి రికవరీ అయిన తర్వాత పాఠశాలకు వచ్చిన పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని వారికి వేడినీరు, తగు ఆహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. చదువుతో పాటు ఆటల్లోనూ పిల్లలు రాణించేలా చూడాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, డైరీ విధిగా కలిగి ఉండి తగిన బోధనోపకరణాలు తయారు చేసుకుని వాటితో పిల్లలకు బోధించాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రుచిగా శుచిగా పెట్టేలా చూడాలని కోరారు. పాఠశాల ప్రాంగణాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని, ప్రయోగశాల, ఆటస్థలాన్ని డీఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్, డైరీలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి శిక్షణ

వీరఘట్టం : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీల ఆదాయం పెంచుకోవడం , నిధుల వినియోగం, పారిశుద్ధ్యం మెరుగు, తాగునీటి వనరుల వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని 34 మంది సర్పంచ్‌లు, 19 మంది ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

పాలకొండలో..

పాలకొండ రూరల్: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నుంచి మూడు రోజులు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగం ఆదేశాతో ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు శిక్షణ ఉంటుందన్నారు. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల విధివిధానాలపై శిక్షణ కొనసాగుతుందన్నారు.

108లో ప్రసవం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మేదరిగండ గ్రామానికి చెందిన గర్భిణి పువ్వల హెలన్సీ బుధవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించినట్లు ఈఎంటీ జెంజేటి గోపాల్, పైలట్ రామారావులు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ హెలన్సీకి పురిటినొప్పులు వచ్చాయని, ఆస్పత్రికి తరలించాలని ఫోన్ ద్వారా అందుకున్న సమాచారం మేరకు గ్రామం నుంచి కురుపాం సీహెచ్‌సీకి ఆమెను తీసుకువెళ్లగా, పరీక్షించిన వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమెను పార్వతీపురం ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌ను ఉల్లిభద్ర వద్ద నిలుపుదల చేసి, తగిన సపర్యలు చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిపారు. అనంతరం పార్వతీపురం ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించిన తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు చెప్పారన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



పాలకొండ: చేనేత కార్మికుల పరికరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటరమణ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేకేసీ కో ఆర్డినేటర్ ఎం. రవికిరణ్ మాట్లాడుతూ, చేనేత రంగం భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేనేత రంగం మరింత బలోపేతం కావాలి..

పాలకొండ: చేనేత రంగం మరింత బలోపేతం కావాలని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ కోటదుర్గమ్మ వీవర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా నిలవాలి

గుమ్మలక్ష్మీపురం: చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ఆదుకోవడంతో పాటు భారతీయత సంప్రదాయాలను కాపాడాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ వి.కల్పన అన్నారు. కళాశాలలో హిస్టరీ అధ్యాపకురాలు శ్రీవాణి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రెడీమేడ్ వస్త్రాల రాకతో చేనేత కార్మికుల జీవనం దుర్భరమైందన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందన్నారు. నేత వస్త్రాలు ధరించడం ద్వారా నేత కార్మికులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చేనేత వస్త్రాలను ప్రోత్సాహించేలా కళాశాల వద్ద ఫ్యాషన్ షో నిర్వహించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సర్వేశ్వరరావు

పాలకొండ : మండలంలోని ఎం.సింగుపురం ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

భామిని: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని మలేరియా నివారణ సబ్‌యూనిట్ అధికారి పి. అప్పారావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మలేరియా, డెంగీ జ్వరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ బిడ్డిక రవికుమార్‌తో కలిసి వంటగది, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ హెచ్‌వీ గౌరీశ్వరి, ఏఎన్‌ఎం సుశీల, ఆశ కార్యకర్త సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం..



మాట్లాడుతున్న పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొనేలా చూడాలన్నారు. ఐటీడీఏ ఆవరణ, స్టేడియం వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేయించాలన్నారు. కార్యక్రమంలో ధ్యో చిన్నబాబు, ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకుసాగాలి: డీఈఓ

కొమరాడ: విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగాడలమ్మ అన్నారు. మండలంలోని మాదలింగి జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై.. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలన్నారు. గతంలో ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని, ఈ ఏడాది మరింత మంది ఎంపికయ్యేలా కృషిచేయాలన్నారు.

శివారు భూములకు అందని వట్టిగెడ్డ నీరు

జియ్యమ్మవలస: మండలంలోని చినతోలుమండ గూడ వద్ద ఉన్న వట్టిగెడ్డ కాలువను సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ.. వట్టిగెడ్డ రిజర్వాయరు దిగువన సుమారు 17 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, కానీ అధికారులు 10 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందివ్వడం లేదని అన్నారు. నీరు అందుబాటులో లేకపోవడంతో 50 శాతం మంది రైతులు ఉబాలు వేయలేకపోయారన్నారు. కాలువలో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో తుంబలి, అల్లువాడ, అలమండ, శిఖబడి వంటి గ్రామాలకు సాగునీరు అందక ఉబాలు వేయలేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సోమయ్య, ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సత్వరమే వైద్యసేవలు అందించాలి

గుమ్మలక్ష్మీపురం: ఆరోగ్య సమస్యతో ఆస్పత్రికి వచ్చే వారికి సత్వరమే వైద్య సేవలు అందివ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. కురుపాం మండలం మొండెంఖల్లు పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ల్యాబ్ రికార్డులు, మలేరియా జ్వరాల నమోదు వివరాలు పరిశీలించారు. కుక్కకాటు, పాముకాటు, అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి తక్షణమే వైద్యసేవలందించాలని సిబ్బందికి సూచించారు. ప్రసూతి వార్డుకు వెళ్లి బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆయన వెంట వైద్యాధికారి హర్ష, ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గరుగుబిల్లి: వసతి గృహంలో ఉండే విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి జి.సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. అనంతరం సిక్ రూంలో అందుబాటులో ఉన్న మందులు, పరికరాలను పరిశీలించారు. వసతిగృహం, వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ సంధ్యారాణి, సూపర్‌వైజర్లు చిన్నమ్మి, రమణమ్మ, ప్రసాద్ తదితరులున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువులపై శ్రద్ధ పెట్టాలని భద్రగిరి సీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం 'నో టొబాకో'.. ఫ్రీ డ్రగ్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ దుర్గాప్రసాద్ పొగాకు, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి సమాజ నిర్మాణానికి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వి.కల్పన, అధ్యాపకులు శ్రీవాణి, తులసి, శాంత, అశోక్ ఉన్నారు.


ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలి

పాలకొండ రూరల్: తరగతుల నిర్వహణతో పాటు ప్రస్తుత సీజన్‌లో విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని తుమరాడ, తంపటాపల్లి, వాటపాగు గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాకిట్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పిల్లలు అనారోగ్యం భారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలలు హెచ్ఎంలకు సూచించారు. పారిశుధ్య నిర్వహణకు తొలి ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఈయన వెంట ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, తదితరులున్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గరుగుబిల్లి: బాల్య వివాహాలు చేయడం, చేయించడం చట్టరీత్యా నేరమని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల వారి భవిష్యత్ నాశనమవుతుందని, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి మాట్లాడుతూ..బాలబాలికల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు పలు చట్టాలను అమలు చేస్తున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వహిస్తే వెంటనే చైల్డ్ కేర్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇందుమతి, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలగింపులు సరికాదు..



పరిపాలనాధికారి జయరామ్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధిత వలంటీర్లు

పాలకొండ రూరల్: ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా.. కేవలం వాట్సాప్ నోటీసులు అందించి తమను విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొనడం అన్యాయమని వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని 16 మంది వలంటీర్లకు అడ్మిన్ సెక్రటరీల ద్వారా వాట్సాప్ నోటీసులు అందించి తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం నగర కార్యాలయం వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం తమకు న్యాయం చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణరావు నేతృత్వంలో ఏఓ జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

● డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తి



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈఓ

పాలకొండ రూరల్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరంలో నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలోని 38 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఉదయం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో హెచ్ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటికే మండల, పట్టణ పరిధిలో ఎంపీపీఎస్ అవలంగి, ఎంపీపీఎస్ నవగాం, జెడ్పీహెచ్ఎస్ చిన మంగళాపురం, ఎంపీపీఎస్ ఎన్‌కే రాజపురం, వెంటకమ్మపేట ఎంయూపీ, జీహెచ్ఎస్, జెడ్పీ హెచ్ఎస్ పాలకొండ, ఎంపీయూపీఎస్ చింతాడ, ఎంపీపీఎస్ తుమరాడ పాఠశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఈయన వెంట ఎంఈఓ కె.సోంబాబు, తదితరులున్నారు.